## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెనమలూరు:** పెనమలూరు సెక్షన్ చోడవరం గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

### వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



**నున్న(విజయవాడ రూరల్):** నున్న గ్రామం చినకంచిలో శుక్రవారం శ్రీ అష్ట లక్ష్మీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి, కామాక్షి అమ్మ వార్లకు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

### నేటితో కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు గడువు ఆఖరు

**గన్నవరం:** వివిధ కార్పొరేషన్ల నుంచి రాయితీపై రుణాల మంజూరుకు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ టి.స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఓబీసీ, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. వార్షిక ఆదాయం రూ. 81 వేల లోపు ఉండి 60 ఏళ్లలోపు వయసు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలతో శనివారంలోపు ఏపీఓబీఎం.ఎం.ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత

**పెనమలూరు:** అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆస్పత్రిలో వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ శుక్రవారం అందజేశారు. పోరంకిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తాడిగడపకు చెందిన షేక్ ఖాజామోహిద్దీన్‌కు రూ.3.50 లక్షలు, ఈడుపుగల్లు గ్రామానికి చెందిన కాసరనేని పద్మశ్రీకి రూ.60 వేల విలువైన ఎల్‌వోసీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు టీడీపీ తాడిగడప అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పెనమలూరు మండల అధ్యక్షుడు కోయా ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రామ్‌కుమార్ అందజేశారు.

### ఆరుగురు జూదరుల అరెస్ట్

**పెనమలూరు:** గోసాల గ్రామంలో పేకాడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం గోసాలలో పోలీసులు రౌండ్స్‌లో ఉండగా గ్రామ శివారులో కొందరు పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.15,700 సొమ్ము స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

### కొనసాగుతున్న ఆధార్ క్యాంపులు



**కంకిపాడు:** ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు కొనసాగుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కంకిపాడు, కోలవెన్ను సచివాలయాల్లో ఈనెల 19వ తేదీ నుంచి ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ 35 మందికి పైగా ప్రజలు, 0-6 ఏళ్ల లోపు చిన్నారులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. క్యాంపులను ఎంపీడీఓ పి.అనూష పర్యవేక్షిస్తున్నారు.

### వెటర్నరీ ఆస్పత్రి పరిశీలన

**గన్నవరం రూరల్:** మండలంలోని గొల్లనపల్లి పశువైద్య చికిత్స కేంద్రాన్ని శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పలు గ్రామాల్లోని పశువులకు వైద్య సేవలు అందిస్తున్న ఈ ఆస్పత్రి భవనానికి మరమ్మతులు చేయించాల్సి ఉందన్నారు. ఈ మేరకు రూ.3 లక్షల నిధులు అవసరమని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు లేఖ రాశామన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

### పేదరికం లేని సమాజ స్థాపనకు కృషి

**ఉయ్యూరు రూరల్:** పేదరికం లేని సమాజ నిర్మాణానికి పీ ఫోర్ సర్వే దోహదపడనుందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు మండలంలోని గండిగుంట గ్రామంలో పీ ఫోర్ సర్వే గ్రామసభ శుక్రవారం జరిగింది. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రైవేట్, దాతల భాగస్వామ్యతో నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోందన్నారు. గండిగుంట గ్రామంలో 2,250 కుటుంబాలను సర్వే చేసి 397 నిరుపేద కుటుంబాలను గుర్తించామన్నారు. సభలో పంచాయతీ కార్యదర్శి కుమార్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# పూడుకుపోయి.. ముందుకు కదలక..



కంకిపాడు సినిమాహాలు సెంటరులో వ్యర్థాలతో నిండిన డ్రెయిన్



పట్టణంలోని వ్యర్థాలు కొట్టుకువచ్చి మురుగుబోదెలో పేరుకున్న దృశ్యం

- కంకిపాడులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- నిర్వహణలో నిర్లక్ష్యం
- దోమల విజృంభణ
- నామమాత్రంగా వ్యర్థాల తొలగింపు

**కంకిపాడు:** పేరుకు మండల కేంద్రం.. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తం. పూడుకుపోయి..వ్యర్థాలతో నిండి.. మురుగు పారక... కాలువలు అధ్వానంగా మారాయి. మురుగు ఎక్కడికక్కడే పేరుకుపోవడంతో దోమలు పెరిగిపోయి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. డ్రెయిన్ల నిర్వహణలో అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయన్న విమర్శలు కంకిపాడు పట్టణ వాసుల నుంచి వినిపిస్తున్నాయి.

**కదలని మురుగు**

పట్టణంలోని ప్రధాన వీధులను కలుపుతూ దశాబ్దాల క్రితం డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఇవి క్రమంగా శిథిలావస్థకు చేరాయి. పందికొక్కుల బెడదతో సమస్య మరింత జటిలంగా మారింది.



గన్నవరం రోడ్డు మార్గంలో కచ్చా డ్రెయిన్ పూడుకుపోయి ఇలా

కాలువల్లో పందికొక్కులు చేరి తవ్వేయడంతో మట్టి పేరుకుపోయింది. దీనికి తోడు పట్టణంలోని ప్రధాన సెంటర్లు, దుకాణ సముదాయాల వద్ద వ్యర్థాలను డ్రెయిన్లలో గుట్టలుగా పోస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయడంతో మురుగు కదలడం లేదు. అడపాదడపా వ్యర్థాలు, మట్టి తొలగింపు పనులను పంచాయతీ చేస్తున్నా అవి తాత్కాలిక ఉపశమనమిస్తున్నాయి. దీంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

**దోమల ఉత్పత్తి కేంద్రాలుగా..**

కంకిపాడు ప్రధాన రోడ్డు, గన్నవరం రోడ్డు, అనుబంధ ప్రధాన రహదారుల్లోని డ్రెయిన్లు పూడుకుపోయి మురుగు నిలిచిపోయి ఉంటోంది. ఇవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా తయారయ్యాయి. దోమలు విజృంభించి పగలూ, రాత్రి తేడా లేకుండా స్వైర విహారం చేస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల దాడితో ప్రజలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

**డ్రెయినేజీ అభివృద్ధితోనే మోక్షం**

పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థను సమూలంగా అభివృద్ధి చేస్తేనే మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఏళ్ల తరబడి ఈ అంశం పెండింగ్‌లోనే ఉంటోంది. దీంతో డ్రెయినేజీలు రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారులు, పాలకులు సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## 50 శాతం రాయితీతో గృహ విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

**పెనమలూరు:** గృహ విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 50 శాతం రాయితీ ఇస్తోందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఈ మేరకు పోరంకిలో శుక్రవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఈ హరిబాబు వివరాలు తెలుపుతూ గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ఏపీసీపీడీసీఎల్ 50 శాతం రాయితీ ప్రకటించిందన్నారు. మార్చి 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా నేరుగా విద్యుత్ కార్యాలయాల్లో దరఖాస్తు అందజేయాలన్నారు. కిలోవాట్‌కు రూ.2,250 అసలు ధర ఉండగా రాయితీ ధర రూ.1,250 మాత్రమే అన్నారు. 6 కిలోవాట్‌ల వరకు రాయితీ ఉంటుందని వివరించారు. విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరించుకోక పోతే విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో పట్టుబడితే జరిమానా విధిస్తారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఈ బోడెపూడి నవీన్‌కుమార్, ఏఈలు కె.సూర్యనారాయణ (పెనమలూరు), పి.సాంబశివరావు (పోరంకి), డీవీ మురళీకృష్ణ (యనమలకుదురు), టి.అశోక్‌కుమార్(కంకిపాడు), టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్ ప్రసాద్ పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్, ఈఈ హరిబాబు

## రేపు ఉచిత యోగాశక్తి చికిత్స శిబిరం

**పెనమలూరు:** పటమట దత్తాశ్రమంలో ఈ నెల 23వ తేదీన ఉచిత యోగాశక్తి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం కానూరులో వివరాలు తెలుపుతూ యోగాశక్తి సాధన సమితి ఆధ్వర్యంలో 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మోకాలి నొప్పుల పై అవగాహన సదస్సుతో పాటు ఉచిత చికిత్స శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. మోకాలి నొప్పులతో బాధపడే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## మారేడుమాకలో రీ సర్వే

**కంకిపాడు:** మండలంలోని మారేడుమాకలో ఏపీ రీ సర్వే ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రామంలోని భూములకు సంబంధించి 400 మంది భూ యజమానులకు 9(2) నోటీసులు అందించాల్సి ఉంది. ఇప్పటికే 350 నోటీసులు రైతులకు అందించారు. ఆయా నోటీసులతో పాటుగా భూ సర్వే అభ్యంతరాలపై పది మంది అర్జీలను ఇటీవల జరిగిన గ్రామసభలో అందజేశారు. అధికారులు నోటీసుల జారీ, అభ్యంతరాల పరిష్కారంపై దృష్టి సారించారు. తహసీల్దార్ వి.భావనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది రీ సర్వే పనులపై దృష్టిసారించారు.

## అన్నప్రసాద వితరణ

**హనుమాన్‌జంక్షన్ రూరల్:** వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మహా అన్నప్రసాద వితరణ జరిగింది. బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో 3,500 మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమివ్వాలి



**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమివ్వాలని పారిశ్రామికవేత్త, పీబీ సిద్ధార్థ కళాశాల వ్యవస్థాపకుల్లో ఒకరైన పర్వతనేని బ్రహ్మయ్య కుమారుడు సంతోష్‌కుమార్ చెప్పారు. వనరులను అవసరానికి మించి వినియోగిస్తే వాతావరణంలో మార్పులు జరిగి భూమిపై నివశించే వారు అనేక దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. సుస్థిర భవిష్యత్తును నిర్దేశించే పర్యావరణ, సామాజిక పాలనా కారకాలు అనే అంశంపై సిద్ధార్థ కళాశాలలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన కళాశాల ఆవరణలోని వెబినార్ హాల్‌లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, సౌత్ రీజనల్ సెంటర్ (ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ) సహకారంతో రెండు రోజుల జరిగే జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ భూతాపం మూలంగా ప్రస్తుతం అన్ని సీజన్లలో ఎండలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. భూమి ఉష్ణోగ్రతను పెంచేస్తున్న కర్బన ఉద్గారాలను కట్టడి చేయకపోతే వాతావరణ సమతుల్యతను పునరుద్ధరించలేమని చెప్పారు.

# పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ

- 19 ఏళ్లుగా స్వచ్ఛందంగా సేవ
- నిత్యాన్నదానం
- పేదలకు ఉచిత వైద్య శిబిరాలు, నిత్యావసరాలు, దుస్తుల పంపిణీ



పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తూ..



నగరంలోని ఆశ్రమంలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న జ్యోతికుమారి

**రామవరప్పాడు:** చిన్నతనంలో ముంచెత్తిన దివిసీమ ఉప్పెనను కళ్లారా చూసిన ఆమె హృదయం ద్రవించింది. ఆకలి చావులు వినకూడదని, పస్తులతో పడుకోకూడదన్న ఆ అమ్మ సంకల్పం ముందు ఆకలి అనే పదం చిన్నదైపోయింది. 19 ఏళ్ల క్రితం ' అన్నపూర్ణ ట్రస్ట్' పేరుతో ప్రారంభమైన ఈ బృహత్కర కార్యక్రమం నేడు ఎంతో మంది దివ్యాంగులు, అభాగ్యులు, నిరాశ్రయుల కడుపు నింపుతూ అన్నపూర్ణగా మారింది తెల్లగడ్డ జ్యోతి కుమారి. కానూరుకు చెందిన జ్యోతికుమారి రూరల్ మండలం ప్రసాదంపాడులో అన్నపూర్ణ ట్రస్ట్‌ను 2007లో ఏర్పాటు చేశారు.

**ద్విచక్రవాహనంపై..**

తొలుత చిన్న గది అద్దె తీసుకుని ట్రస్ట్ ప్రారంభించారు. కార్యాలయం వద్దే వండి పార్సిల్స్‌ను ద్విచక్ర వాహనంపై బస్టాండ్, రైల్వేస్టేషన్‌లకు వెళ్లి నిరాశ్రయులు, అభాగ్యుల ఆకలి తీర్చేవారు. కొందరు మానవతావాదులు వలంటీర్లుగా ముందుకొచ్చారు. జ్యోతి కుమారిది ఉన్నత కుటుంబం కావడం, యూఎస్‌లో స్థిరపడిన కుమార్తె, కుమారుడు ఆర్థిక చేయూతనందించడంతో ట్రస్ట్ మరింత అభివృద్ధి సంతరించుకుంది.

**వందలాది మంది ఆకలి తీరుస్తూ..**

తొలినాళ్లల్లో పది, ఇరవై మంది ఆకలి తీర్చిన అన్నపూర్ణ ట్రస్ట్ ప్రస్తుతం వందలాది మంది కడుపు నింపుతోంది. నగరంలో రోజుకో ప్రాంతంలో నిరాశ్రయులు, అభాగ్యులకు ఆహారం అందజేస్తున్నారు. నగరంలోని పలు అనాథ ఆశ్రమాలు, దివ్యాంగుల ఆశ్రమాల్లో కూడా సేవ చేస్తున్నారు. విరాళాలు ఆశించకుండా నిత్యావసర సరుకులు, బియ్యం వంటి వాటిని సేకరించి బృహత్తర కార్యక్రమానికి వినియోగిస్తున్నారు.

**ఆపన్న హస్తం**

కరోనా, వరదల వంటి విపత్కర సమయాల్లో అన్నపూర్ణ ట్రస్టు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి మన్ననలు పొందింది. పోలీసు, ఇతర శాఖల అధికారుల అనుమతులు తీసుకుని కరోనా సమయంలో నగరంలో పలుచోట్ల ఆహార ప్యాకెట్లు, తాగునీరు, నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేశారు. ఇటీవల వరదల సమయంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం కుట్టు మిషను, పెయింటింగ్, అల్లికలపై ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు.

**నా తర్వాత కూడా ట్రస్ట్ ముందుకెళ్తుంది**

చిన్నతనంలో మా అమ్మ లక్ష్మమ్మ పేదవారు, రోజువారి కూలీలను పిలిచి అన్నం పెట్టేది. మన ఆకలే ముఖ్యం కాదు లేనివారి కడుపు కూడా చూడాలన్నది మా అమ్మ నుంచె నేర్చుకున్నాను. ఈ ఆలోచన నుంచె అన్నపూర్ణ ట్రస్ట్ పుట్టింది. కుటుంబసభ్యుల సహకారంతో ట్రస్ట్‌ను విజయవంతంగా నడపగలుగుతున్నాను. 19 ఏళ్లుగా లక్షలాది మంది ఆకలి తీర్చాం. నా తర్వాత కూడా ట్రస్ట్ ముందుకెళ్తుంది. స్వచ్ఛందంగా ముందుకొస్తున్న దాతలు, వలంటీర్ల రుణం తీర్చుకోలేనిది.

– అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు జ్యోతి కుమారి

**పలు అవార్డులతో సత్కారం**

19 ఏళ్లుగా సేవలు అందిస్తున్న జ్యోతికుమారిని అవార్డులతో పలు సంస్థలు సత్కరించాయి. ఉగాది పురస్కారాలు, మహానటి సావిత్రి బుక్ ఆఫ్ రికార్డ్స్, సావిత్రి సాహిత్య, సాంస్కృతిక కళాపీఠం, వాసవి క్లబ్, ఎన్టీఆర్, ఎస్వీఆర్, ఏఎన్ఆర్ కళాపీఠం, గిరిజన ఫౌండేషన్ వంటి అనేక సంస్థలు జ్యోతి కుమారి చేస్తున్న సేవలను గుర్తించి సన్మానాలు చేసి అవార్డులు అందించాయి. వైఎస్సార్ జయంతి పురస్కరించుకుని శ్రీ సంస్కృతి కళాపీఠం, స్వామి వివేకానంద 155వ జయంతి, దాసరి నారాయణ రావు జయంతి సందర్భంగా ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. తాజాగా నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర (ఎఫ్ టామ్) ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు.

## 30న అభిషేకాలు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** విశ్వావసు నామ సంవత్సరాదిని పురస్కరించుకుని ఈ నెల 30న సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాస రావు శర్మ తెలిపారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో వేం చేసిన సుబ్రహ్మణ్య స్వామికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నామని ఈఓ వై.సీతారామయ్య తెలిపారు.

## ప్రాంగణ ఎంపికలు




**ఉయ్యూరు రూరల్:** జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో మహా లిఫ్ట్ కంపెనీ క్యాంపస్ రిక్రూట్మెంట్ చేసినట్లు ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్ తెలిపారు. మహా లిఫ్ట్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం కళాశాల ప్రాంగణంలో రిక్రూట్మెంట్ చేశారు. కళాశాలలో ట్రిపుల్ ఈ, మెకానికల్ విభాగాల విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక నిర్వహించారన్నారు. ఎంపిక చేసిన విద్యార్థులకు వార్షికాదాయం రెండున్నర లక్షలు ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వెంకటరమణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ లక్ష్మీప్రతాప్, ఏవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, బెల్టుషాపుల నియంత్రణకు చర్యలు

**గన్నవరం:** మండలంలో విచ్చలవిడిగా జరుగుతున్న గంజాయి విక్రయాలను నియంత్రించడానికి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. గంజాయి యువత జీవితాన్ని సర్వనాశనం చేస్తోందని తెలిపారు. జల్సాలకు అలవాటుపడిన యువత గంజాయిని తీసుకువచ్చి విక్రయించడం, తాగడం చేస్తున్నారని చెప్పారు. గంజాయి మత్తులో పడి యువకులు ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరపనేనిగూడెంలో మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులు కూడా గంజాయికి బానిసలేనని తెలిపారు. గంజాయి నియంత్రణలో ప్రభుత్వం మాటలు తప్ప చేతల్లో చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులై పారుతోందని, దీంతో రాత్రివేళలో మహిళలు బయటకు రాలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గంజాయి, మద్యం అక్రమ విక్రయాల కట్టడికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. నేతలు కె.వెంకటేశ్వరరావు, ఏసుదాసు, సాంబశివరావు, మీరాఖాన్, మరియదాసు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

## 'బార్' ప్రాక్టీసింగ్ అడ్వకేట్స్ కార్యవర్గం ఎన్నిక

**గన్నవరం:** బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ ప్రాక్టీసింగ్ అడ్వకేట్స్ అధ్యక్షుడిగా కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జాస్తి తాతారావు ఎన్నికయ్యారు. స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ ప్రాక్టీసింగ్ అడ్వకేట్స్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎస్వీ సాంబశివరావు, సంయుక్త కార్యదర్శిగా వీవీ స్వామి, కోశాధికారిగా ఈడే వాసుదేవరావు, లేడీ రిప్రజెంటేటివ్‌గా కె.ప్రవంతిని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పీఎస్ రాయుడు, సీహెచ్ అంజయ్య, ఆళ్ళ కృష్ణ కిషోర్, అనుమోలు వెంకటేశ్వరరావు, యు.సతిష్కుబాయి, జి.భాస్కర్ నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది తిరివీధి వెంకయ్య వ్యవహరించారు. న్యాయవాదుల ఐక్యతకు నూతన కార్యవర్గం పాటుపడుతుందని సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. కొత్త కోర్టు భవనం నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. అనంతరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు మరీదు తంబికుమార్, భాస్కరరావు, బద్రీనాథ్, తిరివీధి వెంకయ్య తదితరులు పూలమాలలతో సత్కరించారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గం

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**ఉంగుటూరు:** చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గన్నవరం ఎనిమిదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి.శిరీష అన్నారు. ఉంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ గన్నవరం ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి శిరీష మాట్లాడుతూ ఎన్ని చట్టాలు ఉన్నా ఏదో ఒక చోట చిన్నపిల్లలు లైంగిక దాడులకు గురవుతూనే ఉన్నారని, బాల, బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి తెలుసుకోవాలన్నారు. బాల, బాలికలపై ఎవరైనా లైంగిక దాడులు, నేరాలకు పాల్పడితే వారికి శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు ఎస్‌ఐ యు.గోవిందు, సీనియర్ న్యాయవాది ఎస్‌టీజీ నీరజ, గన్నవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి రవికుమార్, ఉపాధ్యక్షులు వేణుబాబు, ఇన్‌చార్జ్ హెచ్ఎం అనంతయ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




ఉంగుటూరులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి శిరీష

## మూడు దశాబ్దాల పోరాట ఫలమే 'వర్గీకరణ'

**గన్నవరం:** మూడు దశాబ్దాల పోరాట ఫలమే ఎస్సీ వర్గీకరణ అని, శాసనసభలో ఎస్సీ వర్గీకరణ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందడంపై ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వేణుమాదిగ, సంఘ నేతలు కోట కృష్ణమోహన్, పొరిటిగడ్డ దేవదాసు, బేడ, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులు వనం నాగేశ్వరరావు, ఎంఈఎఫ్ నేతలు కొడాలి జోసఫ్, దువ్వూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం నుంచి గుణదల పుణ్యక్షేత్రానికి పాదయాత్ర

**గన్నవరం:** తపస్సు కాలంలో భాగంగా గన్నవరం విచారణ అద్భుత బాలయేసు దేవాలయం నుంచి గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం వరకు దీక్షాపరులు, కతోలిక క్రైస్తవులు శుక్రవారం పాదయాత్ర చేశారు. విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో భక్తులు శిలువను చేతపట్టుకుని క్రైస్తవ గీతాలను ఆలపిస్తూ ఈ యాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర కేసరపల్లి, గూడవల్లి, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు మీదుగా మేరీమాత పుణ్యక్షేత్రానికి చేరుకుంది. అక్కడ పసల థామస్ ఆధ్వర్యాన ప్రత్యేక ప్రార్థనల అనంతరం దివ్యబలిపూజ సమర్పించారు.



పాదయాత్రలో విచారణకర్త, విశ్వాసులు

## పీఎంజేజేవైై చెక్కు అందజేత



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** అతి తక్కువ ప్రీమియంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవిత బీమా పథకాలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎస్‌బీఐ ఆరుగొలను బ్రాంచ్ మేనేజర్ కె.రాజేష్ తెలిపారు. బాపులపాడు మండలం ఓగిరాలకు చెందిన ఎస్‌బీఐ ఖాతాదారుడు కఠారి రఘుపతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన భార్య కఠారి జాబిల్లికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేవై) కింద మంజూరైన రూ.2 లక్షల బీమా మొత్తాన్ని శుక్రవారం ఆయన అందజేశారు.

## ఇఫ్తార్ విందు



**పి.నైనవరం(విజయవాడరూరల్):** పి.నైనవరం గ్రామంలో మసీదు నిర్మాణానికి జనసేన సాయం అందిస్తుందని ఆ పార్టీ నేత సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం రాత్రి పి.నైనవరం గ్రామంలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జనసేన నేత, ఏపీఐసీసీ డైరెక్టర్ మండల రాజేష్, అమ్మిశెట్టి వాసు, చలమలశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.